

8 వికెట్ల తేడాతో అనంతపురం విజయం

ప్రజాశక్తి - కడప

జిల్లా క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఎసిఎ సౌత్ జోన్ అండర్ -23 మెన్ మల్టీ డే క్రికెట్ టోర్నీలో భాగంగా మూడు రోజులుగా కెఒఆర్ఎం క్రికెట్ మైదానంలో నిర్వహించిన మ్యాచ్ లో నెల్లూరు జట్టుపై 8 వికెట్ల తేడాతో అనంతపురం జట్టు ఘనవిజయం సాధించింది. ఈ మ్యాచ్‌లో నెల్లూరు జట్టు మొదట ఇన్నింగ్స్ లో 200 పరుగులు చేసింది. అనంతపురం జట్టు మొదటి ఇన్నింగ్స్ లో 249 పరుగులు చేసింది. రెండవ ఇన్నింగ్స్ లో నెల్లూరు జట్టు 151 పరుగులు చేసింది. చివరి రోజు రెండవ ఇన్నింగ్స్ ప్రారంభించిన అనంతపురం జట్టు 19.1 ఓవర్లలో 2 వికెట్ల నష్టానికి 103 పరుగులు చేసి 8 వికెట్ల తేడాతో విజయం సాధించింది. కేఎస్. రోహిత్ రోషన్ 36 పరుగులు చేశారు. నెల్లూరు జట్టులోని సాత్విక్, అఖిల్ సాలంకే ఒక్కో వికెట్ తీసుకున్నారు.

పులివెందుల పోలీసులపై సస్పెన్షన్ వేటు

బలవంతపు వసూళ్ల అక్రమాలపై చర్యలు
విఆర్‌కు ఎస్ఐ, కానిస్టేబుల్, హోంగార్డు సస్పెన్షన్



ప్రజాశక్తి - పులివెందుల టౌన్

పోలీస్ శాఖలో అక్రమాలకు, అవినీతికి పాల్పడిన పోలీసులపై ఎస్పి సిద్ధార్థ కౌశల్ కొరడా ఝుళిపించారు. ఎస్ఐ సత్యనారాయణను విఆర్ పంపారు. అలాగే కానిస్టేబుల్ బి. నరసింహారెడ్డి (పిసి2737), హోంగార్డు జి .రవికుమార్ (హెచ్‌జి600)ను సస్పెండ్ చేసినట్లు ఎస్పి నుంచి పులివెందుల పోలీస్ స్టేషన్‌కు శుక్రవారం సమాచారం అందినట్లు పట్టణ పోలీస్ స్టేషన్ సిఐ రాజు తెలిపారు. వివరాలు.. పులివెందుల పట్టణ పోలీస్ స్టేషన్‌లో పనిచేస్తున్న కానిస్టేబుల్ నరసింహారెడ్డి, హోంగార్డు రవికుమార్ ప్రజలను బెదిరిస్తూ బలవంతపు వసూళ్లు చేస్తున్నారన్న ఆరోపణలపై ఎస్పి విచారణకు ఆదేశించారు. విచారణలో వచ్చిన ఆరోపణలను నిజమని నిర్ధారణ కావడంతో వారిపై పులివెందుల పోలీస్ స్టేషన్ లో 484/2023 గా క్రిమినల్ కేసు నమోదు చేసి వారిని విధులు నుండి సస్పెండ్ చేశారు.

పోలీస్ శాఖలో కలకలం

ఎస్ఐని విఆర్‌కు పంపడం, కానిస్టేబుల్, హోంగార్డును సస్పెండ్ చేసి, కేసు నమోదు చేయడం పై పోలీస్ శాఖలో కలకలం మొదలైంది. అక్రమాలకు అవినీతికి పాల్పడితే పోలీసులైనా, సామాన్యులైనా ఒకటేనని ఈ చర్యలు బట్టి తెలుస్తుంది. అధికారం ఉందని పోలీసులు అమాయకుల ప్రజల పైన తమ ప్రతాపాన్ని చూపించే వారు. ఈ చర్యలతో పోలీసులలో అలజడి మొదలైనట్లు తెలుస్తుంది. చిన్న చిన్న వ్యాపారులపై పోలీసుల తీరు సరిగా లేకపోవడంతో ఈ సంఘటన అన్ని వర్గాల ప్రజల్లో సంతోషం వ్యక్తం అవుతుంది. తప్పు చేస్తే పోలీసులైనా, ప్రజలైనా ఒకటేనన్న నమ్మకాన్ని ప్రజల్లో నింపిన ఎస్పి సిద్ధార్థ కౌశల్ కు ప్రజల నుంచి కృతజ్ఞతలు వెల్లువెత్తాయి.

జిపిఎస్‌ను రద్దు చేయాలి : యుటిఎఫ్

ప్రజాశక్తి - కడప అర్బన్

ఉద్యోగ, ఉపాధ్యాయులకు ముఖ్యమంత్రి అధికారంలోకి రాకముందు ఇచ్చిన హామీ మేరకు పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలని యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి లక్ష్మీరాజా జిల్లా ప్రధాన కార్యదర్శి పాలెం మహేష్ బాబు డిమాండ్ చేశారు. కడప యుటిఎఫ్ భవన్‌లో పోస్ట్ కార్డు ఉద్యమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ముఖ్యమంత్రి సిపిఎస్‌ను రద్దుచేసి పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరిస్తానని, మాట తప్పను మడమ తిప్పనని తెలిపి పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించకుండా జిపిఎస్ అనే మరో దుర్మార్గపూరితమైన పెన్షన్ విధానాన్ని ప్రవేశపెట్టడం సిగ్గుచేటని అన్నారు. ఉద్యోగ ఉపాధ్యాయులు పాత పెన్షన్ కోసం ఎదురు చూస్తుంటే గారడీలు చేసే జిపిఎస్ విధానాన్ని ప్రవేశ పెట్టడం ఉద్యోగ ఉపాధ్యాయులను మోసగించడమేనని తెలిపారు. ఈ ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే పాత పెన్షన్ ప్రవేశపెట్టాలి తప్ప మరో కొత్త పెన్షన్ విధానాన్ని ప్రవేశ పెడితే అంగీకరించే ప్రసక్తే లేదని తెలిపారు. కేంద్ర ప్రభుత్వం 2004కు ముందు అపాయింట్మెంట్ అయినా ఉద్యోగులందరికీ పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని తెలిపినప్పటికీ రాష్ట్ర ప్రభుత్వం మాత్రం దానిని అమలు చేయకుండా కాలక్షేపం చేయడం మంచిది కాదని తెలిపారు. 2003 డిఎస్‌సి వారికి వెంటనే పాత పెన్షన్ వర్తింప చేస్తున్నట్లుగా ఉత్తర్వులు ఇవ్వాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పాత పెన్షన్ విధానం ప్రవేశపెట్టకపోతే ఈనెల 18 నుంచి భవిష్యత్ కార్యాచరణ మొదలవుతుందని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా ట్రెజరర్ నరసింహారావు, జిల్లా కార్యదర్శి ఏజాస్ అహ్మద్, ఆడిట్ కమిటీ కన్వీనర్ ప్రభాకర్, నాయకులు కిరణ్ కుమార్, గోపీనాథ్, కిరణ్ బాబు, శివశంకర్, సమీర్ బాషా, ప్రకాష్ బాబు, శ్రీనివాసులు పాల్గొన్నారు.



పోస్టు కార్డులు ప్రదర్శిస్తున్న యుటిఎఫ్ నాయకులు

నేటి నుంచి రాష్ట్ర స్థాయి హ్యాండ్ బాల్ పోటీలు

- 13 జిల్లాల నుంచి 550 మంది క్రీడాకారులు రాక

ప్రజాశక్తి - కడప

కడప జిల్లా హ్యాండ్ బాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈనెల 14 నుంచి 16 వరకు మూడు రోజుల పాటు కడపలోని జిల్లా స్పోర్ట్స్ అథారిటీ మైదానంలో అండర్ -19 బాలుర, సీనియర్ ఉమెన్ విభాగాలలో రాష్ట్రస్థాయి 2023-24 హ్యాండ్ బాల్ ఛాంపియన్ షిప్ పోటీలు నిర్వహిస్తున్నట్లు జిల్లా హ్యాండ్ బాల్ అసోసియేషన్ అధ్యక్షులు లయన్ కె విష్ణువర్ధన్‌రెడ్డి తెలిపారు. శుక్రవారం స్థానిక హోటల్ గ్రాండ్ ఇన్‌లో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో రాష్ట్రస్థాయి పోటీల వివరాలను తెలిపారు. త్వరలో కడపలో జాతీయ స్థాయి పోటీలు నిర్వహించేందుకు కూడా కడప జిల్లా అండ్ బాల్ అసోసియేషన్ సంసిద్ధంగా ఉందని తెలిపారు. ఈనెల 14 నుండి 16 వరకు మూడు రోజులపాటు కడపలోని జిల్లా స్పోర్ట్స్ అథారిటీ మైదానంలో పోటీలు నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు చెప్పారు. రాష్ట్రంలోని 13 జిల్లాలకు చెందిన 550 మంది క్రీడాకారులు ఈ పోటీలలో పాల్గొననున్నట్లు పేర్కొన్నారు. వీరితోపాటు 40 మంది మేనేజరు, కోచ్‌లు, అఫిషియల్స్, టెక్నికల్ అఫిషియల్స్ కడప వస్తున్నారని తెలిపారు. వీరందరికీ భోజన వసతి సౌకర్యాలు కల్పించినట్లు తెలిపారు. 14న ఉదయం 9 గంటలకు రాష్ట్రస్థాయి హ్యాండ్ బాల్ ఛాంపియన్ షిప్ పోటీలను ఉప ముఖ్యమంత్రి అంజాద్‌బాషా, వైఎస్ఆర్ జిల్లా అధ్యక్షులు, సెట్ సిఇఒ. సి. సాయి గౌస్, డిఇఒ ప్రారంభిస్తారని తెలిపారు. పోటీల ప్రారంభోత్సవ కార్యక్రమానికి రాష్ట్ర హ్యాండ్ బాల్ అసోసియేషన్ అధ్యక్షులు ఎస్. కృష్ణకుమార్, కార్యదర్శి సత్యనారాయణ రాజు హాజరవుతున్నట్లు తెలిపారు. రాష్ట్రస్థాయి పోటీల నిర్వహణకు కంచి గోపికృష్ణ, కంచి సురేంద్రలు తమ వంతు సహకారం అందిస్తున్నందుకు వారికి ఈ సందర్భంగా కృతజ్ఞతలు తెలిపారు. సమావేశంలో జిల్లా హ్యాండ్ బాల్ అసోసియేషన్ ఆర్గనైజింగ్ సెక్రటరీ వి. వి. శివ ప్రసాద్, కోశాధికారి ఎస్. బాబర్, జాయింట్ సెక్రెటరీ బసిరెడ్డి, ఉపాధ్యక్షులు వెంకట సురేష్, అసోసియేషన్ సభ్యులు నాజర్ పాల్గొన్నారు.

శిక్షణా తరగతులు జయప్రదం చేయాలి : సిఐటియు

ప్రజాశక్తి - కడప అర్బన్

అనంతపురంలోని ఇందిరానగర్, గణేనాయక్ భవన్‌లో ఈనెల 14, 15 తేదీల్లో నిర్వహించే సిఐటియు రాయలసీమ శిక్షణా తరగతులు జయప్రదం చేయాలని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి మనోహర్ పిలుపునిచ్చారు. శుక్రవారం సిఐటియు జిల్లా కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా ఆఫీస్ బేరర్స్, కమిటీ సభ్యులు, రంగాల అధ్యక్ష, కార్యదర్శులు, కోశాధికారి, నాయకులు హాజరుకావాలని పేర్కొన్నారు. శిక్షణా తరగతుల్లో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవలంభిస్తున్న విధానాలు, వాటి పర్యవసనాలు, హక్కులు, చట్టాలు, భవిష్యత్తు కర్తవ్యాలు వివరిస్తారని తెలిపారు. రాష్ట్ర నాయకులు ఓబులు, ధనలక్ష్మి, సి.హెచ్. నర్సింగరావు, నాగరాజు, అంజిబాబు హాజరవుతారని చెప్పారు. సమావేశంలో సిఐటియు జిల్లా అధ్యక్షులు శ్రీనివాసులు రెడ్డి, కార్యదర్శి వెంకటసుబ్బయ్య, కమిటీ సభ్యులు చంద్రారెడ్డి పాల్గొన్నారు.

బార్మీ అన్నదానం గొప్పది

ప్రజాశక్తి - కడప అర్బన్

బార్మీ అన్నదానం గొప్ప కార్యమని సిఐటియు జిల్లా అధ్యక్షులు శ్రీనివాసులు రెడ్డి అన్నారు. శుక్రవారం నగరంలోని పాత బస్‌స్టాండ్ ఆవరణంలో సిఐటియు పాత బస్టాండ్ హమాలి యూనియన్ అధ్యక్షుడు షేక్.మస్తాన్ వల్లి ఆధ్వర్యంలో బార్మీ ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా శ్రీనివాసులు రెడ్డి మాట్లాడుతూ బార్మీ సందర్భంగా అన్నదానం మహా మంచికార్యమన్నారు. ప్రతి ఏడాదీ పేదలకు, కార్మికులకు అన్నదానం చేస్తారన్నారు. కార్యక్రమంలో మస్తాన్, బక్సు, షేక్షా, బాష, పులి, గౌస్ పీర్, జాను, మౌలా, మల్లీ పాల్గొన్నారు.

పేదల ఇళ్లు కొట్టేయడం దారుణం

ప్రజాశక్తి - కడపఅర్బన్


కూల్చిన ఇళ్లను పరిశీలిస్తున్న హరిప్రసాద్

బుగ్గవంక రక్షణ గోడ నిర్మాణంలో భాగంగా కమలాపురం ఎమ్మెల్యే రవీంద్రనాద్‌రెడ్డి గ్రూప్ థియేటర్లను కాపాడటం కోసం అలైన్మెంట్ మార్చి పేదల ఇళ్లు కూల్చేయడం దుర్మార్గమని టిడిపి రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి బాలిశెట్టి హరిప్రసాద్ ఆరోపించారు. జిల్లా యంత్రాంగం బుగ్గవంక రక్షణ గోడ ఏర్పాటు భూసేకరణలో భాగంగా పేదల ఇళ్లు కూల్చివేస్తున్నారని బాధితులు తెలపడంతో శుక్రవారం హరిప్రసాద్ ఆ ప్రాంతాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడారు బుగ్గవంక భూసేకరణలో భాగంగా బాధితులకు తగిన సమయం ఇవ్వకుండా, నష్ట పరిహారం చెల్లించకుండా అధికారులు దగ్గరుండి కూల్చేయడం అన్యాయమని వాపోయారు. అభివృద్ధికి బుగ్గవంక రక్షణ గోడ ఏర్పాటుకు తాము వ్యతిరేకం కాదని యంత్రాంగం పరిశీలనతో బాధితులకు నష్ట పరిహారం చెల్లించి తగిన సమయం ఇచ్చి రోడ్లు కాలువలు నిర్మించాలని ఆయన డిమాండ్ చేశారు. పరిశీలనలో టిడిపి తెలుగు యువత జిల్లా కార్యదర్శి ఎన్.రవికుమార్, బాధితులు పాల్గొన్నారు.

ఇసుక, మద్యంపై దర్యాప్తు చేయాలి : టిడిపి

ప్రజాశక్తి - కడప అర్బన్

ప్రజలకు మంచి చేయాల్సిన సిఐడి ఉన్నత అధికారులు ప్రభుత్వంతో కలిసి కక్ష సాధింపు చర్యలకు పాల్పడ్డం, నిరాధరంగా వేధించడం తగదని టిడిపి జిల్లా అధికార ప్రతినిధి మన్సూర్ అక్బర్ అన్నారు. శుక్రవారం ఆయన కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చంద్రబాబు నాయుడును అరెస్టు చేసి 35 రోజులు అయిందని ఇంతవరకు రూ.3 అవినీతిని కనుగొన్నారా అని ప్రశ్నించారు. సిఐడి అధికారుల వద్ద ఎలాంటి ఆధారాలు లేవని తెలిపారు. చంద్రబాబు నాయుడు అరెస్టును పాకిస్తాన్‌తో సహా దాదాపు 18 దేశాల్లో తప్పు అని రోడ్డు మీదకు వచ్చి ఖండిస్తున్నారని చెప్పారు. సమావేశంలో మైనారిటీ నాయకులు రాజంపేట అబ్దుల్ సలాం, రూపనగుడి హుస్సేన్ పాల్గొన్నారు.

అదనపు ఛార్జీలు వసూలు చేస్తే చర్యలు తప్పవు

ప్రజాశక్తి - కడప

ప్రయాణికులకు ఇబ్బంది కలగకుండా ప్రస్తుతం ఉన్న రేట్లతో మాత్రమే బస్సులు నడపాలని, అదనపు ఛార్జీలు వసూలు చేస్తే చర్యలు తప్పవని ప్రయివేటు బస్సు యజమానులకు జిల్లా ఉప రవాణా కమిషనర్ మీరా ప్రసాద్ ఆదేశించారు. దసరా ఉత్సవాలను పురస్కరించుకుని శుక్రవారం స్థానిక రవాణ శాఖ కార్యాలయంలో వైఎస్ఆర్ జిల్లా కాంట్రాక్ట్ క్యారేజీ బస్సుల యజమానులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగాఆయన బస్సు యజమానులతో మాట్లాడుతూ దసరా సందర్భంగా ప్రయాణికులకు ఏ విధమైన ఇబ్బంది కలగకుండా ప్రస్తుతం ఉన్న రేట్లతో మాత్రమే బస్సులు నడపాలని సూచించారు. ఎట్టి పరిస్థితుల్లోనూ టికెట్ రేట్లు పెంచకూడదన్నారు. టికెట్ రేట్లు పెంచినట్లయితే కేసులు బుక్ చేసి జరిమానా విధించడంతో పాటు చట్టపరమైన చర్యలు తీసుకుంటామని చెప్పారు. వాహన యజమానులు తమ వాహనాల పనులన్నీ వాహన పోర్టల్ ద్వారా మాత్రమే జరుపుకోవాలని తెలిపారు

నాటుసారా ప్రభావిత ప్రాంతాలు తనిఖీ

ప్రజాశక్తి -పులివెందుల రూరల్

కడప జిల్లా ఎస్ఇబి అడిషనల్ ఎస్పి ప్రవీణ్ కుమార్ పులివెందుల స్పెషల్ ఎన్ఫోర్స్‌మెంట్ బ్యూరో స్టేషన్ పరిధిలో ఉన్న నాటుసారా ప్రభావిత గ్రామాలను శుక్రవారం పరిశీలించారు. లింగాల మండలంలోని అంబకపల్లి గ్రామాన్ని, పులివెందుల పట్టణంలో ఉన్న నగరిగుట్ట ప్రాంతాన్ని సందర్శించారు. నాటుసారా కేసులలో నేరాలు చేసిన వ్యక్తులను వారి ఇళ్లకు వెళ్లి కౌన్సెలింగ్ నిర్వహించారు. నాటుసారా తయారీ, అమ్మకం, రవాణా వంటి నేరాలకు పదే పదే నిర్వహించిన వారి మీద పీడీ చట్టాన్ని సైతం ప్రయోగిస్తామని హెచ్చరించారు. కేసులలో ఇరుక్కుని కుటుంబాన్ని గుల్ల చేసుకోవద్దని సూచించారు. మండల పరిధిలోని కనుమపల్లి పోలీస్ చెక్ పోస్ట్‌ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. అక్కడ పని చేసే సిబ్బందికి పలు సూచనలు చేశారు. వాహనాలు ప్రతి ఒక్కటీ క్షుణ్ణంగా తనిఖీ చేసే విధంగా ఉండాలని, పండుగ సీజన్ ఉంది కాబట్టి అప్రమత్తంగా ఉండాలని నిఘాను ఉంచి పని చేయాలని సూచించారు. కార్యక్రమంలో సి.ఐ రామాంజనేయులు, ఎస్.ఐ కళ్యాణ్ కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

స్వస్థలానికి చేరిన బొగ్గుడి చిన్నపురెడ్డి

ప్రజాశక్తి - కడప


బాధితుడికి ఆర్థిక సాయం చేస్తున్న ఇలియాస్

ఆంధ్రప్రదేశ్ నాన్ రెసిడెంట్ తెలుగు సొసైటీ సహకారంతో కువైట్‌లో డ్రైవర్‌గా పని చేస్తున్న జిల్లా వాసి అయిన బొగ్గిడి చిన్న పురెడ్డి స్వస్థలానికి సురక్షితంగా చేరినట్లు ఎపిఎన్ఆర్‌టిఎస్ డైరెక్టర్ బీ.హెచ్. ఇలియాస్, కువైట్ వైసిపి కన్వీనర్ ముమ్మడి బాలిరెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బొగ్గిడి చిన్నపురెడ్డి ఒకటిన్నర సంవత్సరం కిందట కువైట్ ఇంట్లో డ్రైవర్ పని నిమిత్తం కువైట్ వెళ్లారని పేర్కొన్నారు. 3 నెలలుగా కిడ్నీ సమస్యతో బాధపడుతున్నాడని, సమస్య ఎక్కువైతే కష్టం అని భావించి ఇండియా వెళ్లాలని నిర్ణయించుకున్నాడని చెప్పారు. విషయం మాధవరానికి చెందిన పల్లె సుబ్బారామి రెడ్డి దృష్టికి చిన్నపు రెడ్డి తీసుకుని వెళ్లగా వెంటనే ఇండియన్ ఎంబసికి తీసుకొని పోయి అధికారుల సాయంతో పాస్‌పోర్టు ఇప్పించారన్నారు. టికెట్ డబ్బులు రూ. 11 వేలు కువైట్ రెడ్డీస్ వెల్ఫేర్ అసోసియేషన్ వారు ఇచ్చారు అని తెలిపారు. కార్యక్రమంలో రెడ్డీస్ వెల్ఫేర్ సొసైటీ అధ్యక్షులు అరవ వెంకట సుబ్బారెడ్డి, రాజా పాల్గొన్నారు.

వృద్ధులకు పండ్లు, బ్రెడ్లు పంపిణీ

ప్రజాశక్తి - కడప


వృద్ధులకు పండ్లు, బ్రెడ్లు పంపిణీ చేస్తున్న విద్యార్థులు

వికాస్ హై స్కూల్ కరస్పాండెంట్ వికాస్ హరికృష్ణ, స్కూలు విద్యార్థులు శుక్రవారం బృందా వృద్ధాశ్రమాన్ని సందర్శించి అక్కడ ఉన్న వృద్ధులకు పండ్లు, బ్రెడ్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వికాస్ హరికృష్ణ మాట్లాడుతూ కడప నగరం అక్కాయపల్లెలోని వికాస్ హైస్కూల్ విద్యార్థులు చదువుతోపాటు సామాజిక బాధ్యత నేర్పించాలనే ఉద్దేశంతో బృంద్ర వృద్ధాశ్రమాన్ని సందర్శించామని చెప్పారు. స్కూల్ విద్యార్థులు అవ్వ తాతలతో సంతోషంగా మాట్లా డుతూ వాళ్ల పడే మనోవేదనను విద్యార్థులు అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులను చూసి వృద్ధులు తమ ముని మనవళ్లను తలుచుకుంటూ సంతోషించారు. ఈ ఫీల్డ్ ట్రిప్ వల్ల విద్యార్థులలో వారి తల్లిదండ్రుల మీద ప్రేమ అభిమానాలు పెరుగుతాయని, పిల్లలు పెద్దయ్యాక వాళ్ళ తల్లిదండ్రులను ప్రేమగా చూసుకుంటారన్నారు.

ఎస్‌వి ఇంజినీరింగ్ కళాశాలలో ఫ్రెషర్స్ డే వేడుకలు

ప్రజాశక్తి-కడప సిటీ : స్థానిక బాలాజీ నగర్‌లోని శ్రీ వెంకటేశ్వర ఇంజినీరింగ్ కళాశాలలో బిటెక్ రెండవ సంవత్సరం చదువుతున్న విద్యార్థులు మొదటి సంవత్సరం విద్యార్థులకు ఘనంగా ఫ్రెషర్స్‌డేను నిర్వహించారు. ఈ సందర్భంగా సీనియర్స్ జూనియర్ విద్యార్థులకు సలహాలు సూచనలు ఇచ్చారు. ఇంజినీరింగ్ విద్యలో సీనియర్, జూనియర్ అనే తేడా లేకుండా కలిసికట్టుగా ఉండాలని, ప్రతి సీనియర్ విద్యార్థీ జూనియర్స్‌కు కావలసిన సహాయ సహకారాలను అందిస్తామని హామీ ఇచ్చారు. ప్రిన్సిపల్ డాక్టర్ ఆర్ వీర సుదర్శన రెడ్డి మాట్లాడుతూ ఫ్రెషర్స్ డే నిర్వహించిన సీనియర్ విద్యార్థులకు అభినందనలు తెలిపారు.

కమిషనర్ నిర్ణయం మార్చుకోవాలి

ప్రజాశక్తి - కడప అర్బన్



నిరసన తెలియజేస్తున్న ముస్లిమ్ నాయకులు

కడప నగరం యాకూబ్ సాహెబ్ మసీదుకు సంబంధించిన శ్మశాన స్థలం రోడ్డు విస్తరణలో భాగంగా 12 అడుగులుంటే దాదాపు 50 సెంట్లు స్థలాన్ని తీసుకోవాలని మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ తీసుకున్న నిర్ణయం సరైందని కాదని అఖిలపక్ష నాయకులు, ముస్లిం నాయకులు శుక్రవారం నిరసన తెలియజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దాదాపు 300 సంవత్సరాలుగా ఉన్న ఈ శ్మశానంలో ఎందరో మహానుభావులను సూఫీలను, సయ్యద్‌లను, మషాయికీనులను ఖననం చేశారని తెలిపారు. ఈ స్థలంలో ఉన్న సమాధుల పైన రోడ్డు వేయాలని నిర్ణయించడం సబబు కాదని పేర్కొన్నారు. దీన్ని వక్ఫ్ బోర్డు కూడా వ్యతిరేకించిందని పేర్కొన్నారు. ముఖ్యమైన విషయం ఏమంటే సమాధులను తొలగించకూడదు అని సుప్రీంకోర్టు తీర్పు కూడా ఇచ్చిందని చెప్పారు. అయినా కడప మునిసిపల్ కమిషనర్ స్థలం తీసుకుంటామని నిర్ణయించడం ముస్లిం సమాజమంతా ఖండిస్తుందని పేర్కొన్నారు. ముస్లిముల మనోభావాలు దెబ్బతినకుండా కమిషనర్ తమ నిర్ణయాన్ని మార్చుకోవాలని కోరారు. అలకానిపక్షంలో మసీదు కమిటీ, అఖిలపక్షం కూర్చుని ప్రజా పోరాటం చేసి కమిషన్ నిర్ణయాన్ని అడ్డుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో సంఘసేవకులు సయ్యద్ సలావుద్దీన్, అమీర్ బాబు, నజీర్ అహ్మద్, జిల్లాని భాష, నాజర్ అలీ, సత్తార్, రెహమాన్, వీరితోపాటు పెద్ద సంఖ్యలో ముస్లిం యువకులు పాల్గొన్నారు.

జూదరహిత ప్రొద్దుటూరుగా తీర్చిదిద్దుతా: ఎమ్మెల్యే

ప్రజాశక్తి-ప్రొద్దుటూరు

ఎన్నో ఏళ్లుగా పేదలను పట్టిపీడిస్తున్న మట్కా, గుట్కా, జూదం, క్రికెట్‌బెట్టింగ్ వంటి అసాంఘిక కార్యకలాపాలు ఇకమీదట ప్రొద్దుటూరు పట్టణంలో లేకుండా చేస్తానని ఎమ్మెల్యే రాచమల్లు ప్రసాదరెడ్డి అన్నారు. స్థానిక మున్సిపల్ కార్యాలయంలో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. తనపై తన కౌన్సిలర్లపై వస్తున్న వదంతులపై స్పందిస్తూ సత్ప్రవర్తన కలిగిన వారే ప్రజాజీవితంలో ఉండాలన్నారు. ప్రొద్దుటూరులోనే కాకుండా ప్రపంచవ్యాప్తంగా అనేక జూదాలు ఎప్పటి నుండో ఉన్నాయని, తన అనుచరులే ఇవి చేస్తున్నట్లుగా ప్రతిపక్షాలు చెప్పడం హాస్యాస్పదంగా ఉందని పేర్కొన్నారు. ఇలాంటి వాటిని అంతమొందించి తన నిజాయితీని నిరూపించుకుంటానని అన్నారు. ఈ విషయంలో జిల్లా ఎస్పిని కలిసి తీసుకోవాల్సిన చర్యలను చర్చిస్తానన్నారు. ప్రొద్దుటూరులో ఎటువంటి అసాంఘిక కార్యకలాపాలు జరక్కుండా ఖద్దరు,ఖాకీలు కలిసి తీసుకోవాల్సిన చర్యలపై దృష్టి పెడతానని తెలిపారు. సమావేశంలో కౌన్సిలర్లు, నాయకులు పాల్గొన్నారు.

సాయిబాబా స్కూల్‌లో దసరా వేడుకలు

ప్రజాశక్తి - కడప అర్బన్


దసరా వేడుకల్లో చిన్నారులతో వైఎస్‌చైర్మన్

నగరంలోని అక్కాయపల్లె సాయి బాబా స్కూల్‌లో దసరా వేడుకలు ఘనంగా నిర్వహించారు. శుక్రవారం నిర్వహించిన వేడుకలకు ముఖ్య అతిథిగా సాయిబాబా విద్యా సంస్థల వైస్ చైర్మన్ ఎం.వి.సాయిసుధీర్ కుమార్ రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చెడుపై మంచి విజయం సాధించడమే విజయదశమి పండుగ విశేషమని తెలిపారు. మనిషి తనలోని స్వార్థ, అన్యాయ, అహంకార దుర్గుణాలను తొలగించుకునుటకు ఉత్తమమైన మార్గమని చెప్పారు. విద్యార్థులు సత్ప్రవర్తన కలిగి ఉండి, పెద్దల పట్ల భక్తి, గౌరవం ఉండాలని పేర్కొన్నారు. 48వ డివిజన్ కార్పొరేటర్ ఎం.వి.శ్రీదేవి ప్రజలకు, తల్లిదండ్రులకు, విద్యార్థులకు దసరా శుభాకాంక్షలు తెలిపారు. సాంస్కృతిక కార్యక్రమాలు ఎంతగానో అలరించాయి. విద్యార్థులు సంకల్ప దీక్షతో విజయాలు సాధించాలని చెప్పారు. కార్యక్రమంలో హెడ్ మాస్టర్ సుబ్బరాయుడు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, విద్యార్థులు పాల్గొన్నారు.

గురుకుల్ విద్యాపీఠ్ హైస్కూల్‌లో..

నగరంలోని పాత ఆర్‌టిసి బైపాస్ రోడ్‌లో ఉన్న గురుకుల్ విద్యాపీఠ్ హై స్కూల్‌లో ముందస్తు దసరవేడుకులు ఘనంగా నిర్వహించారు. శుక్రవారం ఎవిఆర్ విద్యా సంస్థల చైర్మన్ ఎ.వెంకటేశ్వర్లు మాట్లాడుతూ విద్యార్థులో మంచి భావాన్ని పెంపొందించేందుకు పండుగలు ఉపయోగపడతాయని పేర్కొన్నారు. దసరా శుభాకాంక్షలు తెలిపారు. విద్యార్థులు వేషదారణలు ప్రదర్శించారు. కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్ ఎ.వీరకుమారి, సిఇఒ ఎ.ఎల్.వివేకానందరెడ్డి, పల్లవి, పాఠశాల హెడ్ మాస్టర్ ఎన్.మునిచంద్ర, అసిస్టెంట్ హెడ్ మాస్టర్ నరసింహ, పాఠశాల క్యాంపస్ ఇన్‌ఛార్జీ సర్వేశ్వరరెడ్డి, పాఠశాల అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ ఆకాష్‌నందన్, పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.


గురుకుల్ విద్యాపీఠ్‌లో దసరా వేషధారణలో చిన్నారులు

నేటి నుంచి సిపిఎం జిల్లా స్థాయి శిక్షణ తరగతులు

- కేంద్ర కమిటీ సభ్యులు ఎం.ఎ.గఫూర్ రాక

ప్రజాశక్తి-కడప అర్బన్

సిపిఎం జిల్లా స్థాయి శిక్షణ తరగతులు ఈ నెల14,15న నగరంలో నిర్వహిస్తున్నట్లు సిపిఎం జిల్లా కార్యదర్శి జి. చంద్రశేఖర్ తెలిపారు. శుక్రవారం సిపిఎం జిల్లా కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రెండు రోజుల పాటు నిర్వహించే శిక్షణ తరగతులలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలపై పార్టీ కార్యకర్తలకు శిక్షణ ఇస్తున్నట్లు తెలిపారు. రానున్న ఎన్నికలను దృష్టిలో పెట్టుకొని పార్టీ కేడర్‌ను సంసిద్ధత చేసేందుకు ఈ శిక్షణ తరగతులను పార్టీ సభ్యులు సద్వినియోగం చేసుకోవాలని పేర్కొన్నారు. ఈ శిక్షణ తరగతులను సిపిఎం కేంద్ర కమిటీ సభ్యులు కర్నూలు ఎక్స్ ఎమ్మెల్యే ఎం.ఎ. గఫూర్ ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రారంభిస్తారని చెప్పారు. పార్టీ మండల శాఖ కార్యదర్శులు, జిల్లా కమిటీ సభ్యులు, పార్టీ ముఖ్యులు పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. సమావేశంలో సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు ఎ.రామ్మోహన్, బి.దస్తగిరి రెడ్డి పాల్గొన్నారు.

పోలీస్‌స్టేషన్‌ను తనిఖీ చేసిన ఎస్‌పి

ప్రజాశక్తి- పోరుమామిళ్ల టౌన్

స్థానిక పోలీస్ స్టేషన్‌ను ఎస్పి సిద్ధార్థ కౌశల్ అకస్మికంగా తనిఖీ చేశారు. స్టేషన్ రికార్డులను పరిశీలించి, తగిన సూచనలు సూచించారు. స్టేషన్ ఆవరణంలో పట్టుబడిన లారీలను, వాహనాలను పరిశీలించి వివరాలను తెలుసుకున్నారు. పోరుమామిళ్ల సర్కిల్ పరిధిలో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో సర్కిల్ ఇన్‌స్పెక్టర్ చిరంజీవి, ఎస్ఐ మల్లికార్జున్‌రెడ్డి, ఎఎస్ఐ రాజశేఖర్‌రెడ్డి, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు. **కాశినాయన :** ఎస్పి సిద్ధార్థ కౌశల్ నర్సాపురం పోలీస్ స్టేషన్‌ను ఆకస్మికంగా తనిఖీ చేశారు.అక్కడ ఉన్న పరిసర ప్రాంతాలను పరిశీలించారు. మండలంలో ఎక్కడ ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా వారి సమస్యలను పరిష్కరించాలని పోలీసు సిబ్బందికి సూచించారు. ముఖ్యంగా చోరీలపై ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. అనంతరం రికార్డులు పరిశీలించారు. ఆయన వెంట పోరుమామిళ్ల సిఐ చిరంజీవి, ఎస్ఐ హరిప్రసాద్ ఉన్నారు

15 నుంచి ప్రొద్దుటూరులో దసరా వేడుకలు

ప్రజాశక్తి-ప్రొద్దుటూరు

దసరా ఉత్సవ వేడుకల్లో రెండవ మైసూరుగా పేరుగాంచిన ప్రొద్దుటూరులో ఈనెల 15 నుంచి దసరా ఉత్సవాలు ప్రారంభం కానున్నాయని ఆర్యవైశ్యసభ అధ్యక్షుడు బుశెట్టి రామ్మోహన్ తెలిపారు. అమ్మవారిశాలలో శుక్రవారం ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. 133 సంవత్సరాల కిందట వెలసిన శ్రీ వాసవీ మత్యన్యకా పరమేశ్వరి దేవి (అమ్మవారు) ఆలయంలో దేవిశరన్నవరాత్రి వేడుకలను వైభవంగా ప్రతి ఏటా నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ప్రజలకు ఎలాంటి అసౌకర్యం కలుగకుండా ఆనందంగా సంబరాలు జరుపుకునేందుకు అన్ని సౌకర్యాలు కల్పించామన్నారు. రోజూ సాయంత్రం అమ్మవారు ప్రత్యేక అలంకారంతో భక్తులకు దర్శనం ఇస్తారన్నారు. దసరా వేడుకలకు తలమానికం అయిన విజయదశమిరోజు నిర్వహించే తొట్టి మెరవణి గ్రామోత్సవం కనుల విందుగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశామన్నారు. పోలీసు యంత్రాంగంతో కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేశామన్నారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య సభ్యులు నాగేశ్వరరావు, జొన్నలగడ్డ రవీంద్రబాబు, కామిశెట్టి నవీన్ పాల్గొన్నారు.

ఏర్పాట్లను పరిశీలించిన ఎస్‌పి ... ప్రొద్దుటూరులో జరిగే దసరా ఉత్సవాల ఏర్పాట్లను ఎస్పి సిద్ధార్థ కౌశల్ శుక్రవారం పరిశీలించారు. అమ్మవారిశాల, శివాలయం, చెన్నకేశవస్వామి దేవాలయం, రాజరాజేశ్వరిదేవాలయం, సత్యనారాయణ ఆలయాలను పరిశీలించారు. అక్కడి కమిటీ సభ్యులతో మాట్లాడుతూ భక్తులకు దర్శనానికి అవసరమైన ఏర్పాట్ల గురించి చర్చించారు. ఎక్కడా ఎలాంటి అసౌకర్యం కలుగకుండా ఉత్సవాలను నిర్వహించాలని సూచించారు. ఆయన వెంట ఎఎస్పి ప్రేరణకుమార్, సిఐలు, ఎస్ఐలు ఉన్నారు.

కడప విజయదుర్గా దేవి ఆలయంలో...

ప్రజాశక్తి- కడప అర్బన్


మాట్లాడుతున్న మల్లికార్జునరావు

శ్రీశ్రీశ్రీ విజయ దుర్గా దేవి ఆలయంలో ఈనెల 15 నుంచి ప్రారంభమయ్యే శరన్నవరాత్రి మహోత్సవాలను జయప్రదం చేయాలని ఆలయ వ్యవస్థాపకులు సుధా మల్లికార్జునరావు కోరారు. శుక్రవారం ఆలయ సమావేశ మందిరంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 15న అమ్మవారు శైలపుత్రి అలంకారం, 16న బ్రహ్మచారిని, 17న చంద్రఘట్ట, 18న కుష్మాండ దేవి, 19న స్కందమాత, 20న కాత్యాయిని, 21న కాలరాత్రి, 22న మహా గౌరీ, 23న సిద్ధి ధాత్రి అలంకారంలో అమ్మవారి దర్శనం ఇస్తారని తెలిపారు. రాత్రి 8 గంటలకు అమ్మవారి ఆలయం నుంచి పురవీధుల్లో ఊరేగింపు ఉంటుందని చెప్పారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. సమావేశంలో ఆలయ నిర్వాహకులు దుర్గాప్రసాద్ పాల్గొన్నారు.

విజ్ఞానాన్ని పంచుకోవాలి

ప్రజాశక్తి - కడప అర్బన్



ప్రశంసా పత్రాన్ని అందజేస్తున్న కె.ఎస్. రెడ్డి

విద్యార్థులు, సహోద్యోగులు విజ్ఞానాన్ని పంచుకోవాలని ఐఐటి మద్రాస్ మెకానికల్ ఇంజినీరింగ్ ఆచార్యులు డాక్టర్ కె.ఎస్.రెడ్డి అన్నారు. శుక్రవారం కెఎస్ ఆర్ఎం ఇంజినీరింగ్ కళాశాలలో ఇసిఇ రీసెర్చ్ అండ్ డెవలప్మెంట్ విభాగం సంయుక్త ఆధ్వర్యంలో సైన్స్ అండ్ ఇంజినీరింగ్ రీసెర్చ్ బోర్డు, కేంద్ర ప్రభుత్వ సంస్థ న్యూఢిల్లీ వారి ఆర్థిక సహకారంతో స్మార్ట్ హైబ్రీడ్ పునరుత్పాదక శక్తి సాంకేతికతలు అనే అంశంపై ముగింపు సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భవిష్యత్ పునరుత్పాదక ఇందనం హైడ్రోజన్ ఆధారిత శక్తి ఉత్పత్తి పై వివరించారు. 40 మందికి ప్రశంసా పత్రాలు అందజేశారు. సదస్సు నిర్వహించిన వారిని కళాశాల వైస్ చైర్మన్ కందుల మదన్‌మోహన్‌రెడ్డి, కరస్పాండెంట్ కందుల రాజేశ్వరమ్మ, ఎండి డాక్టర్ కందుల చంద్ర ఓబుల్‌రెడ్డి అభినందించారు.



విలేకరులతో మాట్లాడుతున్న పిసిసి మీడియా చైర్మన్ తులసిరెడ్డి

మోడీ పాలనలో ఆకలి కేకలు : పిసిసి

ప్రజాశక్తి - వేంపల్లె

మోడీ పాలనలో మేడిపండు చందంగా తయారై ఆకలి కేకలు వినిపిస్తున్నాయని పిసిసి మీడియా చైర్మన్ తులసిరెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం వేంపల్లెలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ ప్రపంచ ఆకలి సూకి 2023లో 125 దేశాల్లో భారత్ 111 స్థానంలో ఉండడం శోచనీయం అన్నారు. పొరుగు రాష్ట్రమైన పాకిస్తాన్ 102, బంగ్లాదేశ్ 81, శ్రీలంక, నేపాల్ 69 స్థానాల్లో ఉండడం గర్హనీయమని అన్నారు. 2022లో 107వ స్థానంలో ఉండగా 2023లో 111వ స్థానానికి దిగజాగిందని చెప్పారు. జగన్ పాలనలో పాఠశాలల నిర్వహణ నిధులు విడుదల చేయాని కారణంగా పాఠశాలలో చాక్ పీసులు, స్టేషనరీ కొనడానికి కూడా డబ్బులు లేవని చెప్పారు. కొన్ని చోట్ల హెడ్ మాస్టర్ లే సొంత డబ్బులు ఖర్చు చేస్తున్నట్లు చెప్పారు. పాఠశాల నిధులు వెంటనే విడుదల చేయాలని కోరారు. పావు కోడికి ముప్పావలా మసాలా అన్నట్లుంది జగన్ పాలన అన్నారు. 25 లక్షల ఇళ్లు కట్టించి పేదలకు ఇస్తామని వైసిపి తన ఎన్నికల మేనిఫెస్టోలో పేర్కొందని చెప్పారు. 5.85 లక్షల ఇళ్లు మాత్రమే నిర్మించిందని చెప్పారు. అవి కూడ పిచ్చుక గూళ్ల లాగా ఉన్నట్లు పేర్కొన్నారు. మేనిఫెస్టోలో పేరొన్న విధంగా మిగతా 19.15 లక్షల ఇళ్లను త్వరితగతిన పూర్తి చేయాలని తులసిరెడ్డి డిమాండ్ చేశారు. విలేకరుల సమావేశంలో కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షుడు సుబ్రమణ్యం, రామకృష్ణ, నరసింహారెడ్డి, బద్రి, రాఘవయ్య, శివ, నాగార్జున, చెన్నకేశవ, వేమయ్య, ఉత్తన్న, అమర్ పాల్గొన్నారు.

ప్రజల చేతిలో వజ్రాయుధం

ప్రజాశక్తి - బద్వేలు

సమాచార హక్కుచట్టం ప్రజల చేతిలో వజ్రాయుధం లాంటిదని జిల్లా సమాచార హక్కు చట్టం రక్షణ వేదిక జిల్లా ఉపాధ్యక్షులు బద్వేలు గురుమూర్తి పేర్కొన్నారు. శుక్రవారం పట్టణంలోని ఆర్‌టిసి మజ్దూర్ యూనియన్ కార్యాలయంలో కడప జిల్లా సమాచార హక్కుచట్టం రక్షణ వేదిక ఆధ్వర్యాన అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమాచార హక్కు చట్టం 2005 సంవత్సరం నుంచి అమలులో ఉందని చెప్పారు. అవినీతి నిర్మూలనకు పారదర్శకతకు జవాబుదారీ తనానికి ఇది ప్రజలచేతిలో వజ్రాయుధమని చెప్పారు.ప్రజలకు ఎంతో ఉపయోగపడుతుందని, దీనిపై అవగాహన కల్పించాల్సిన కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు విఫలమయ్యాయని వాపోయారు. ప్రస్తుతం కొందరు అధికారులు అడిగిన సమాచారం కాకుండా తప్పుడు ఇచ్చి ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అన్ని మండల, జిల్లా ప్రభుత్వ కార్యాలయాల్లో గ్రీవెన్స్ సెల్ రోజున చట్టం పట్ల ప్రజలకు అవగాహన కల్పించడానికి ప్రత్యేక సెల్‌ను ఏర్పాటు చేయాలన్నారు. తర్వాత సమాచార హక్కు చట్టం స్పెక్షన్ అవగాహన కరపత్రాలను దరఖాస్తు ఫారాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో బద్వేలు ప్రభుత్వ పెన్షనర్ల సంఘం కార్యదర్శి కత్తి బ్రహ్మయ్య, పూలే అంబేద్కర్ రాజ్యాధికార సమితి జిల్లా ఇన్‌ఛార్జ్ ఎం పిచ్చయ్య, బిఎస్‌పి నియోజకవర్గ అధ్యక్షులు గోసేటి, ఆవాజ్ కమిటీ బద్వేలు అధ్యక్షులు ఎస్.ఎ సత్తార్, డిబిఎస్ రాష్ట్ర కార్యదర్శి సభ్యులు డి.చిన్నయ్య, దళిత నాయకులు పాల్గొన్నారు.

రాయితీ శనగలు సద్వినియోగం చేసుకోవాలి

ప్రజాశక్తి -ముద్దనూరు

ప్రభుత్వం రాయితీ ద్వారా అందిస్తున్న శనగలు రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఎంపిపి -1పాలగిరి రేణుక అన్నారు. మండలం లోని ఉప్పలూరు గ్రామ సచివాలయంలో శుక్రవారం రేణుక, వైసిపి నాయకులు వీర ప్రతాప్ ఆధ్వర్యంలో రైతులకు రాయితీ శనగ పంపిణీ చేశారు. వ్యవసాయ అధికారి వెంకట కృష్ణారెడ్డి మాట్లాడుతూ గ్రామంలోని రైతులకు 39.80 క్వింటాళ్ల శనగలు 40 శాతం రాయితీతో పంపిణీ చేసినట్లు చెప్పారు. విత్తనం వేసే ముందు ట్రయికోడెర్మా విరిడీ అనే శిలీంద్రంతో ఒక కిలో శనగ విత్తనాలకు 8 గ్రాములు కలిపి విత్తనశుద్ధి చేసుకోవాలన్నారు. ఇలా చేయడం వల్ల ఎండు తెగులు, వేరు కుళ్లు తెగులు, రాకుండా పంటను కాపాడుకోవచ్చన్నారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

ప్రజాశక్తి -చక్రాయపేట

స్థానిక మండల కేంద్రంలోని చక్రాయపేట 33 కెవి ఫీడర్‌లో మరమ్మతులు కారణంగా శనివారం శనివారం ఉదయం 8 గంటల నుండి 12 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నామని ఎఇఇ ప్రవీణ్ కుమార్ యాదవ్ ఒక ప్రకటనలో తెలిపారు. కె. ఎర్రగుడి, కె.రాజు పల్లె, చక్రాయపేట, మహాదేవపల్లెలకు నాలుగు గంటలసేపు విద్యుత్ సరఫరా నిలిపి వేస్తున్నట్లు తెలిపారు. వినియోగదారులు గమనించి సహకరించాలన్నారు.

దసరా సెలవులు ప్రయివేట్ ఉపాధ్యాయులకు కూడా ఇవ్వాలి

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు (పుట్టపర్తి సర్కిల్)

రాబోవు దసరా సెలవులు ప్రయివేట్ ఉపాధ్యాయులకు కూడా ఇవ్వాలని స్టేట్ క్లాసులు, క్లాస్ వర్కుల పేరుతో వారిని స్కూల్‌కు రమ్మని చెప్పకూడదని డివైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి వీరనాల శివకుమార్ తెలిపారు. శుక్రవారం ప్రొద్దుటూరు కార్యాలయంలో విలేకర్ల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా శివకుమార్ మాట్లాడుతూ ప్రభుత్వం 14 నుంచి దసరా సెలవులు ప్రకటించిందని కానీ ప్రతి సారి జిల్లా లోని ప్రైవేటు, కార్పొరేట్ విద్యా సంస్థలు అందులో పని చేస్తున్న ఉపాధ్యాయులకు సెలవులు వర్తింపజేయకుండా వివిధ రకాల పేరుతో వారిని విద్యా సంస్థలకు రావాలని ఒత్తిడి తెస్తున్నారన్నారు. వారిని బెదిరిస్తూ ఉద్యోగాల నుండి అకారణంగా తొలగిస్తున్నారన్నారు. ముఖ్యంగా ప్రొద్దుటూరు పట్టణంలో విద్యా శాఖ అధికారులు ఉన్నా లేనట్లుగానే వ్యవహరిస్తున్నారన్నారు. సమావేశంలో జిల్లా ఉపాధ్యక్షులు డేవిడ్ రాజ్ పాల్గొన్నారు.

టౌన్ ప్లానింగ్ అధికారిగా శారద

ప్రజాశక్తి - ఎర్రగుంట్ల

ఎర్రగుంట్ల నగర పంచాయతీ కార్యాలయంలో నూతన టౌన్ ప్లానింగ్ ఆఫీసర్‌గా ఎ.శారద శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. ఈమె గతంలో చిత్తూరు మున్సిపల్ కార్పొరేషన్‌లో టౌన్ ప్లానింగ్ సెక్షన్‌లో విధులు నిర్వర్తిస్తూ టిపిఒగా ఉద్యోగోన్నతి పొంది ఇక్కడికి బదిలీపై వచ్చారు.

ఢిల్లీ పబ్లిక్ స్కూల్‌లో ముందస్తు దసరా ఉత్సవాలు

ప్రజాశక్తి - చాపాడు

స్థానిక డిపిఎస్‌లో శుక్రవారం ముందస్తుగా దసరా ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో దసరా ప్రాముఖ్యతకు సంబంధించిన చిన్నారులు ప్రదర్శించిన నవదుర్గ అవతార విశేషాలు వీక్షకులను ఆకట్టుకున్నాయి. దసరాను జరుపుకోవడంలో దాగి ఉన్న విశేషం, శరన్నవరాత్రుల అలంకార విశేషాలు, మహిషాసురుడిని దుర్గాదేవి సంహరించిన విధానం పాఠశాల చిన్నారులు చాలా చక్కగా ప్రదర్శించారు. పాఠశాల చైర్మన్ డాక్టర్ వి.జయచంద్ర రెడ్డి మాట్లాడుతూ చెడు పైన మంచి సాధించిన విజయానికి గుర్తుగా విజయదశమిని జరుపుకుంటారని మనం తలపెట్టే అన్ని పనులలో విజయం దక్కాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్ వి. లోహిత్ రెడ్డి ,పాఠశాల ప్రిన్సిపల్ వి.రవీంద్ర కుమార్ , విద్యార్థులు, వారి తల్లిదండ్రులు, ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు.



దుర్గమ్మ వేషధారణలో విద్యార్థులు

భానుడి భగ భగలు

రైతన్నల్లో ఆందోళన



నిర్మానుష్యంగా మారిన రోడ్లు

ప్రజాశక్తి - పులివెందుల టౌన్

వాతావరణం వేసవి తలపిస్తుంది. మండుతున్న ఎండలతో జనం అల్లాడుతున్నారు. మరోవైపు పంటలు ఎండ తాకిడిని తట్టుకోలేక పోతున్నాయి. రైతన్నల్లో ఆందోళన మొదలైంది. మండుతున్న ఎండలతో జనం అల్లాడిపోతున్నారు. రెండు వారాలుగా ఎండ తీవ్రత జనాలను భయానికి గురి చేస్తుంది. శుక్రవారం పులివెందులలో 39 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదయింది. ఈ కాలంలో ఈ స్థాయిలో ఉష్ణోగ్రత నమోదు కావడం ఆందోళన కలిగిస్తుంది. సాధారణంగా సెప్టెంబర్, అక్టోబర్ నెలలో వర్షాలు పడి వాతావరణం చల్లదనంతో ఉండాలి. కానీ ఏడాది పరిస్థితి అందుకు భిన్నంగా ఉంది. అక్టోబర్ రెండో వారంలోనే మండు వేసవిని తలపిస్తుంది. ఉదయం ఎనిమిది గంటల నుంచి సూర్యుడి ప్రతాపంతో తీవ్ర వేడి ఇబ్బందులు పెడుతోంది. సాయంత్రం ఐదు గంటలకు వేడి గాలుల ఉండడంతో ఉక్కపోతతో జనాల అల్లాడుతున్నారు. పొలాల్లో ఉన్న తేమ శాతం ఎండ తీవ్రత కు ఆవిరైపోతుంది. పంటలు వాడు మొహం పెడుతున్నాయి , రైతన్నల్లో ఆందోళన మొదలైంది. రాత్రి వేళల్లో కూడా ఉష్ణోగ్రత తగ్గలేదంటే పరిస్థితి ఎంత భయానకారంగా ఉందో అర్థం చేసుకోవచ్చు. వర్షాలు పడితే ఉపశమనం కలుగుతుందని జనం ఆశిస్తున్న , వర్షం మాత్రం రావడం లేదు. కనీసం వాతావరణంలో మార్పు కనిపించకపోవడంతో జనాలలో మరింత ఆందోళన చెందినా చేస్తున్నాయి. రాబోయే రోజుల్లో ఉష్ణోగ్రతలు మరింత పెరిగే అవకాశం ఉందని ప్రజలు అప్రమత్తంగా ఉండాలని వాతావరణశాఖ అధికారులు సూచిస్తున్నారు.

ఆరోగ్యాంధ్రప్రదేశ్‌గా తీర్చిదిద్దడమే లక్ష్యం

ప్రజాశక్తి -ఖాజీపేట

ఆంధ్ర రాష్ట్రాన్ని ఆరోగ్య ఆంధ్రప్రదేశ్‌గా తీర్చిదిద్దాలన్నదే ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్మోహన్ రెడ్డి ఆశయమని మైదుకూరు ఎమ్మెల్యే శెట్టిపల్లి రఘురామిరెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం మండల పరిధిలోని తవ్వారు పల్లె గ్రామంలో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే రఘురామిరెడ్డి హాజరయ్యారు. ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న జగనన్న ఆరోగ్య సురక్ష పేద ప్రజలకు వరంగామారిందన్నారు. ఈ సందర్భంగా నిర్వహించిన వైద్య శిబిరంలో ప్రజల ఆరోగ్య వివరాలను ఎమ్మెల్యే అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో మైదుకూరు నియోజకవర్గ సమన్వయకర్త నాగిరెడ్డి, ఎపిఐఎసి డైరెక్టర్ గంగాధర్ రెడ్డి, ఎంపిపి అబుబకర్ సిద్దిక్, సహకార సంఘం అధ్యక్షుడు పి.వి.రాఘవరెడ్డి, వైసిపి నాయకులు బిఎంబి బాష, అమరేశ్వర్ రెడ్డి, వైసిపి నాయకులు, అభిమానులు, అధికారులు, పెద్ద ఎత్తున పాల్గొన్నారు. **చాపాడు** ప్రజలకు సులభంగా వైద్య సేవలు అందించే లక్ష్యంతో వైసిపి ప్రభుత్వం జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని ఏర్పాటు చేసిందని ఎమ్మెల్యే ఎస్.రఘురామిరెడ్డి సూచించారు. శుక్రవారం మండల పరిధిలోని అయ్యవారిపల్లి గ్రామంలో నిర్వహించిన సురక్ష కార్యక్రమంలో పాల్గొన్నారు. కార్యక్రమంలో నియోజకవర్గ వైసిపి సమన్వయకర్త నాగిరెడ్డి, ఎంపిపి లక్ష్మమయ్య, ఎంపిడిఒ శ్రీధర్ నాయుడు, తహాశీల్దార్ యామిని, డాక్టర్ ఓబులేసు, డాక్టర్ కావ్య మాధురి, ఎస్ఎస్ తేజ, ఎంపిటిసి రమాదేవి, వైసిపి నాయకులు మాధవ్ రెడ్డి, లక్ష్మిరెడ్డి, జయ సుబ్బారెడ్డి, శ్రీను, పివి రమణారెడ్డి, రామాంజనేయుల రెడ్డి, పంచాయతీ కార్యదర్శి వేణు, వైద్య సిబ్బంది రాఘవయ్య, మహాదేవ యాదవ్, భాస్కర్, రమేష్, నారాయణరెడ్డి సచివాలయ సిబ్బంది, ప్రజలు పాల్గొన్నారు. **సింహాద్రిపురం :** పేదలకు ఆధునిక వైద్యం జగనన్న ఆరోగ్య సురక్ష ద్వారా లభిస్తుందని, ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని మండల ప్రత్యేక అధికారి నాగలింగాచార్యులు పేర్కొన్నారు. శుక్రవారం మండలంలోని బలపనూరులో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో తహాశీల్దార్ మహబూబ్ బాషా, ఇఒపిఆర్‌డి పద్మనాభరెడ్డి, సర్పంచ్ కృష్ణారెడ్డి, కోవరగుంటపల్లి పిహెచ్‌సి వైద్యులు పాల్గొన్నారు. **మైలవరం :** మండల పరిధిలోని చిన్న కొమెర్లలో శుక్రవారం నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో జమ్మలమడుగు ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి గ్రామ సర్పంచ్ నారపరెడ్డి జగదీశ్వర్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి మాట్లాడుతూ ప్రజల ఆరోగ్య సమస్యలను క్షేత్రస్థాయిలోనే గుర్తించి పేద ప్రజలపై ఆర్థిక భారం లేకుండా నాణ్యమైన వైద్యం అందించడమే లక్ష్యంగా జగనన్న ఆరోగ్య సురక్ష పథకాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. గ్రామ సర్పంచ్ జగదీశ్వర్ రెడ్డి మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ జగనన్న ఆరోగ్య సురక్ష పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. (కార్యక్రమంలో ఎంపిడిఒ రామచంద్ర రెడ్డి, మాజీ మార్కెట్ యార్డ్ చైర్మన్ శివ గురువు రెడ్డి, జడ్‌పిటిసి మహాలక్ష్మి, ఎంపిపి సావిత్రమ్మ, వైద్య సిబ్బంది, సచివాలయ సిబ్బంది, ఎంపిటిసిలు, వైసిపి విష్ణువర్ధన్ రెడ్డి శివ భాస్కర్ రెడ్డి శ్రీనాథ్ రెడ్డి, పాల్గొన్నారు. **ఎర్రగుంట్ల :** మండల పరిధిలోని పోట్లదుర్తి సచివాలయం పరిధిలో శుక్రవారం జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని నిర్వహించారు. మండల తహాశీల్దార్ నాగేశ్వరరావు, ఎంపిడిఒ రంతుల్లయ్య పరిశీలించారు. కార్యక్రమంలో వైద్యులు జ్యోత్స్న, సాయి చరిత, పద్మావతి, నాగార్జున, స్పెషలిస్ట్ డాక్టర్లు షర్మిల, దీపక్, పిహెచ్‌సి సూపర్‌వైజర్ ఓబులేసు, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.



చాపాడు : ఆరోగ్య సురక్షపై వైద్యుడితో చర్చిస్తున్న ఎమ్మెల్యే రఘురామిరెడ్డి

విద్యుత్ ఛార్జీలు తగ్గించాలి : ఎపి చేనేత కార్మిక సంఘం

ప్రజాశక్తి - మైలవరం

రాష్ట్ర ప్రభుత్వం విద్యుత్ భారాలు ప్రజలపై పడకుండా వివిధ రకాల ట్రూ అప్, ఇతర పేర్లతో బాదుతున్న బాదుడును ఉపసంహరించుకోవాలని ఆంధ్రప్రదేశ్ చేనేత కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు వీరనాల శివ నారాయణ తెలిపారు. శుక్రవారం సిపిఎం మైలవరం మండల కమిటీ ఆధ్వర్యంలో మండల కార్యదర్శి కొండయ్య అధ్యక్షతన మండల కేంద్రంలోని నాలుగు రోడ్ల కూడలిలో నిరసన కార్యక్రమం చేపట్టారు అనంతరం విద్యుత్ శాఖ కార్యాలయ అధికారులకు వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వీరనాల శివ నారాయణ మాట్లాడుతూ ఎన్నికల ముందు ఇచ్చిన హామీని విస్మరించి మాట తప్పిన జగన్మోహన్ రెడ్డిని రాబోయే ఎన్నికల్లో ఇంటికి సాగనంపే రోజులు దగ్గరపడ్డాయని తెలిపారు అధికారంలోకి వస్తే విద్యుత్ ఛార్జీలను పెంచబోవునని ఎన్నికల ముందు హామీ ఇచ్చిన ఆయన అధికారంలోకి వచ్చాక మాట తప్పి ప్రజలపై పెద్ద ఎత్తున విద్యుత్ ఛార్జీలను పెంపుదల చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. 200 యూనిట్ల వరకు అందరికీ ఉచిత విద్యుత్ ఇస్తానని హామీ ఇచ్చారన్నారు. ఇప్పుడు అహామీని మరిచారన్నారు. రైతులకు ఉచిత విద్యుత్తు సైతం ఎసురు పెడుతూ వస్తున్నారు. ఎస్సీ ఎస్టీ వృత్తిదారులుకు ఇస్తున్న రాయితీలలో కోతలు పెట్టారన్నారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ముకున్నడిగా విద్యుత్ సరఫరా పేరుతో ప్రజలు దోపిడీ చేస్తున్నారని వేయబడ్డారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం విద్యుత్ చర్ల పెంపు తరహా నిర్ణయాలని ఉపసంహరించుకొని ప్రజలపై భారాలు పడకుండా చార్జీలు తగ్గించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు పల్లా. లక్ష్మీనారాయణ సంజీవ రాయుడు ఓబులేసు శేషయ్య ప్రసాదు నవీను గోపాల్, యు.లక్ష్మి నారాయణ పాల్గొన్నారు.



అధికారికి వినతిపత్రం ఇస్తున్న నాయకులు

జగనన్న కాలనీ రోడ్లను పరిశీలించిన చైర్మన్

ప్రజాశక్తి-ఎర్రగుంట్ల : నగర పంచాయతీ పరిధిలో నిర్మిస్తున్న జగనన్న కాలనీ రోడ్లను శుక్రవారం మున్సిపల్ చైర్మన్ హర్షవర్ధన్ రెడ్డి పరిశీలించారు. ప్రొద్దుటూరు మెయిన్‌రోడ్ నుంచి జగనన్న కాలనీకి వెళ్లే రోడ్డు పెద్ద పెద్ద గోతులు, బురదమయంతో అస్తవ్యస్తంగా మారింది. ఇళ్ల నిర్మాణాలకు అవసరమైన ఇటుకలు, సిమెంటు, కంకర తరలించే వాహనాలు ఈ రహదారి గుండా ప్రయాణించేటప్పుడు ఇరుక్కుపోవడం నిత్యకృత్యంగా మారింది. మూడు రోజుల్లో రెండు వాహనాలు ఇరుక్కుపోవడంతో ముడి సరుకు రవాణా చేయడానికి వాహనదారులు నిరాకరిస్తున్నారు. ఈ విషయంగా లబ్ధిదారులు అధికారులకు ఫిర్యాదులు చేశారు. మున్సిపల్ చైర్మన్ హర్షవర్ధన్ రెడ్డి రోడ్డు మరమ్మతు పనులు వెంటనే ప్రారంభించాలని అధికారులకు సూచించారు. కార్యక్రమంలో మున్సిపల్ ఎఇ సురేష్ బాబు, హౌసింగ్ ఎఇ రామకృష్ణ, హౌసింగ్ వర్క్ ఇన్‌స్పెక్టర్ బాష కౌన్సిలర్ అలీ, వైసిపి నాయకులు చంద్రారెడ్డి, సుదర్శన్ రెడ్డి పాల్గొన్నారు.

బ్రిడ్జి నిర్మాణానికి ఎన్నేళ్ల సమయం కావాలి : ఎమ్మెల్సీ

ప్రజాశక్తి- పులివెందుల రూరల్ : సిఎం సొంత నియోజకవర్గంలో రూ.32 కోట్లతో బ్రిడ్జిని నిర్మించడానికి ఎన్నేళ్ల సమయం కావాలని శాసనమండలి సభ్యుడు భూమిరెడ్డి రామగోపాల్ రెడ్డి ఒక ప్రకటనలో ప్రశ్నించారు. వేంపల్లి మండలంలోని వేంపల్లి -తూపల్లి మధ్య పాపాగ్ని నదిమీద వంతెన నిర్మాణానికి ప్రధానమంత్రి గ్రామసడక్ యోజన క్రింద కేంద్రం 2018లో రూ. 32 కోట్లు మంజూరు చేసిందన్నారు. 2018 అక్టోబర్‌లో పనులు ప్రారంభమైతే ఇప్పటికీ ఐదేళ్లయినా 30 శాతం కూడా చేయలేదంటే ప్రభుత్వ పర్యవేక్షణ ఏ విధంగా ఉందో అర్థం చేసుకోవచ్చన్నారు. అర్థమవుతోందన్నారు .ప్రతి నెలా పులివెందుల అభివృద్ధిపై సిఎంసమీక్షిస్తున్నారని, బ్రిడ్జి నిర్మాణం గురించి సిఎం తెలుసా, తెలియదా అయన ప్రశ్నించారు. ఇంత నిర్లక్ష్యంగా పని చేస్తున్న కాంట్రాక్టర్ పై చర్యలు తీసుకోకుండా ఎందుకు ఉపేక్షిస్తున్నారన్నారు. 30 శాతం పని కూడా చేయకుండా బిల్లులు చేసుకుని డబ్బులు కాజేసినట్లు ఆరోపణలున్నాయన్నారు. వంతెన పూర్తి కాకపోవడంతో వేంపల్లి రైతులు, అలిరెడ్డిపల్లి, తూపల్లి ప్రజలు అనేక ఇబ్బందులు పడుతున్నారన్నారు. నిర్లక్ష్యంగా పని చేస్తున్న కాంట్రాక్టర్ పై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ విషయమై ,రాష్ట్ర ప్రభుత్వ నిర్లక్ష్యంపై ప్రధానమంత్రికి ,కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖకు ఫిర్యాదు చేస్తానన్నారు

ప్రతి గడపకూ సంక్షేమ పథకాలు

ప్రజాశక్తి-పులివెందుల టౌన్ : వైఎస్ జగన్మోహన్‌రెడ్డి ప్రభుత్వంలో ప్రతి గడపకు సంక్షేమ పథకాలు అందుతున్నాయని వై.ఎస్. మనోహర్ రెడ్డి అన్నారు. శుక్రవారం పార్లమెంట్ సభ్యులు వైఎస్ అవినాష్ ఆదేశాల మేరకు పురపాలక ఇన్‌ఛార్జి వై.ఎస్. మనోహర్‌రెడ్డి పులివెందుల మున్సిపాల్టీ పరిధిలోని శ్రీ రామ ఆలయ సమీపంలో ఉన్న సచివాలయం పరిధిలోని శ్రీరామ , హోరెబు చర్చి, నగరి గుట్ట తదితర ప్రాంతాలలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో మునిసిపల్ చైర్మన్ డాక్టర్ వల్లెపు వరప్రసాద్, కమిషనర్ నరసింహ రెడ్డి, మార్కెట్ యార్డ్ చైర్మన్ గోటూరు చిన్నప్ప,సివిల్ సప్లైస్ డైరెక్టర్ హోల్ గంగాధర్ రెడ్డి గారు,వైస్ చైర్మన్ హాఫీజ్,ఓతూరు రసూల్, కౌన్సిలర్ లక్ష్మి ప్రసన్న, కోడి రమణ, పార్నపల్లి కిషోర్, సిద్ధయ్య, డానియల్ ఖాదర్, రవి పాల్గొన్నారు.

'బాబు' ఆరోగ్య విషయాలు జైలు అధికారులు ఎలా వెల్లడిస్తారు?

ప్రజాశక్తి- పులివెందుల రూరల్

చంద్రబాబు ఆరోగ్య విషయాలను వైద్యులు వెల్లడించాలే కానీ, జైలు అధికారులు ఏ విధంగా వెల్లడిస్తారని పులివెందుల టిడిపి ఇన్‌ఛార్జి మాజీ ఎమ్మెల్సీ మా రెడ్డి రవీంద్రనాథ్ రెడ్డి (బీటెక్ రవి) పేర్కొన్నారు. శుక్రవారం సాయంత్రం స్థానిక రింగ్ రోడ్ లో చంద్రబాబు ఆరోగ్యంపై ఆందోళన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా పులివెందుల ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి బంధువు వైఎస్ భాస్కర్ రెడ్డి హత్య ఆరోపణంలో జైల్లో ఉండాల్సిన వ్యక్తి కార్పొరేట్ హాస్పిటల్ లోనూ, ఇంట్లోనే ఉంటూ బెయిల్ పొడిగిస్తూ ఉన్నారని విమర్శించారు. ప్రజల మనిషి, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అభివృద్ధి రూపకల్ప అయిన నారా చంద్రబాబునాయుడు అక్రమ కేసుల్లో జైల్లో పెట్టడం వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ చేస్తున్న పెద్ద తప్పు అని బీటెక్ రవి పేర్కొన్నారు. ఆయన ఆరోగ్య పరిస్థితిలపై ఆంధ్ర రాష్ట్ర ప్రజలే కాకుండా దేశ ప్రజలు కూడా ఆందోళన వ్యక్తం చేస్తుంటే సరైన వైద్యం అందించక పోవడం దారుణమని చెప్పారు. ఒక ఫోను హెల్త్ బుల్ టెన్ జైలు అధికారులతో ప్రజలకు వివరించడం ఏమిటని ప్రశ్నించారు. చంద్రబాబుకు ఇచ్చే మందులలో స్టెరాయిడ్ కలిపి ఇస్తున్నారని ఇప్పటికే పలు ఆరోపణలు వస్తున్నాయని దృష్టిలో ఉంచుకొని మంచి కార్పొరేట్ హాస్పిటల్ మెరుగైన వైద్యం అందించాలని తెలిపారు లేనిపక్షంలో రాష్ట్రవ్యాప్తంగా ప్రజా ఆగ్రహానికి గురికాక తప్పదని వారు తెలిపారు కార్యక్రమంలో పులివెందుల పట్టణ అధ్యక్షులు అన్నారెడ్డి ప్రసాదరెడ్డి, నాయకులు నల్లగారి భాస్కర్ రెడ్డి మాభాష విశ్వనాథరెడ్డి ఖాసీం అమర్ యాదవ్ పాల్గొన్నారు.

ప్రజాక్షేత్రం నుంచి దూరం చేసే కుట్ర

ప్రజాశక్తి-జమ్మలమడుగు రూరల్ : మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడును ప్రజాక్షేత్రం నుంచి దూరం చేసే కుట్రలో భాగంగానే అరెస్టు చేశారని టిడిపి జమ్మలమడుగు నియోజకవర్గ ఇన్‌ఛార్జి చరిపిరాళ్ల భూపేష్ సుబ్బ రామిరెడ్డి తెలిపారు. శుక్రవారం పాత బస్టాండ్ దగ్గర మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చంద్రబాబును తక్షణమే సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రికి తరలించి అధునాతన వైద్యం అందించాలన్నారు. ప్రజా నాయకుడు చంద్రబాబు పై అక్రమ కేసులు బనాయించి 35 రోజులుగా జైలుకే పరిమితం చేసిన జగన్‌రెడ్డి అక్కడ కనీస సౌకర్యాలు కూడా కల్పించకుండా ఇబ్బందులు పాలు చేయడం అనేది దుర్మార్గపు చర్యన్నారు. 40 సంవత్సరాలకు పైగా రాజకీయ జీవితం 14 సంవత్సరాలుగా సీఎంగా, 15 సంవత్సరాలు ప్రతిపక్షనేతగా పనిచేసిన వ్యక్తిని అన్యాయంగా అరెస్టు చేయడమే కాకుండా ఒక నాయకునికి కనీస సౌకర్యాలు కల్పించకుండా ఇబ్బంది పెడతారా? అని ప్రశ్నించారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ శివ నాథ్ రెడ్డి, రాష్ట్ర కార్యదర్శి రమణారెడ్డి, తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఎస్ఐ మెయిన్స్‌కు గడువు పొడిగించాలి : డివైఎఫ్ఐ

ప్రజాశక్తి - బద్వేలు



మాట్లాడుతున్న డివైఎఫ్ఐ నాయకులు

ఎస్ఐ మెయిన్స్ పరీక్షలకు మూడు నెలల సమయం ఇవ్వాలని డివైఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు ముడియం చిన్ని పేర్కొన్నారు. స్థానిక సుందరయ్య భవనంలో డివైఎఫ్ఐ బద్వేల్ పట్టణ నాయకులతో కలసి సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా డివైఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు ముడియం చిన్ని మాట్లాడుతూ ఎస్ఐ మెయిన్స్ వాయిదా వేయాలని , దేహదారుఢ్య పరీక్షలలో అవకతవకలు ఉన్నాయని, అభ్యర్థులు ఇప్పటికే న్యాయస్థానాన్ని ఆశ్రయించారని, కోర్టులో కూడా విచారణ జరుగుతున్న నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం జోక్యం చేసుకొని నిరుద్యోగ అభ్యర్థులకు అనుగుణంగా ఈనెల14,15 జరిగే పరీక్షలు వాయిదా వేసే విధంగా నిర్ణయం తీసుకోవాలన్నారు. ఈవెంట్స్‌ను షెడ్యూల్ ప్రకారం నిర్వహించకుండా ఇప్పుడు హడావుడిగా నియామక మండలి షెడ్యూల్ ప్రకారం మెయిన్స్ నిర్వహించడమంటే నిరుద్యోగులను మోసం చేయడానికే అనేది స్పష్టమవుతుందనారు. తక్షణమే పోలీస్ ఉన్నతాధికారులు, రాష్ట్ర ప్రభుత్వం స్పందించి మెయిన్ పరీక్షలకు రెండు నెలలు గడువు పెంచాలని డిమాండ్ చేశారు. సమావేశంలో డివైఎఫ్ఐ పట్టణ అధ్యక్షుడు ఎస్‌కె మస్తాన్ షరీఫ్, ఉపాధ్యక్షులు ఆంజనేయులు, ట్రెజరర్ పి సురేంద్ర పాల్గొన్నారు.

చంద్రబాబు ప్రాణాలతో చెలగాటం తగదు

ప్రజాశక్తి - ఖాజీపేట

టిడిపి జాతీయ అధ్యక్షులు, మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడును రాజమండ్రి జైలులో అధికారులు తీవ్ర ఇబ్బందులు పెడుతున్నారని, ఉక్కపోతతో డీహైడ్రేషన్‌కు గురైనా, స్కిన్ ఎలర్జీతో ఇబ్బందులు అవస్థలు పడుతున్నా పట్టించుకోవడం లేదని టిడిపి రాష్ట్ర సీనియర్ నాయకులు రెడ్యం వెంకటసుబ్బారెడ్డి పేర్కొన్నారు. మంగళవారం మండలంలోని దుంపలగట్టులోని కెసి కెనాల్ ప్రాజెక్టు కమిటీ వైస్ చైర్మన్ రెడ్యం చంద్రశేఖర్‌రెడ్డి నివాసంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు విషయంలో పోలీసు ఉన్నతాధికారులు ముఖ్యమంత్రి, ప్రభుత్వ ఒత్తిడితోనే నిర్లక్ష్యం చేస్తున్నారని ఆరోపించారు. సాక్ష్యాలు, ఆధారాలు లేకుండా ఏ తప్పు చేయని చంద్రబాబు నాయుడును జైలుకు పంపి, ఆరోగ్యం బాగ లేకపోయినా ఆస్పత్రికి తరలించగా హింసించడం దారుణమని వాపోయారు. చంద్రబాబు 5 కిలోల బరువు తగ్గినందున కిడ్నీలపై ప్రభావం చూపుతుందని తెలిసినా ఆసుపత్రికి పంపడం లేదని చెప్పారు. సమావేశంలో టిడిపి సీనియర్ నాయకులు నాగేశ్వర్‌రెడ్డి, కార్యకర్తలు పాల్గొన్నారు.

చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలి

ప్రజాశక్తి - చాపాడు

విద్యార్థులు చదువుతో పాటు ఆటపోటీలలో రాణించాలని ప్రధానోపాధ్యాయులు రమాదేవి సూచించారు. మైదుకూరు జిల్లా పరిషత్ హైస్కూల్‌లో క్రీడలలో ప్రతిభ చూపిన విద్యార్థులను అభినందించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ విద్యార్థులు క్రీడలలో రాణించడం వల్ల శారీరక దృఢత్వంతో పాటు మానసిక ఒత్తిడి నుంచి బయటపడవచ్చన్నారు. పాఠశాలలో అండర్ -17 జంప్ రోప్ నేషనల్ మీట్‌లో ముగ్గురు విద్యార్థులు, సూపర్ సెవెన్ క్రికెట్ నేషనల్ మీట్‌లో ఒకరు , సూపర్ సెవెన్ క్రికెట్ స్టేట్ మీట్‌లో ముగ్గురు, అండర్-17 అటియ పటియ స్టేట్ మీట్‌లో12 మంది విద్యార్థులు 3వ స్థానం సాధించారన్నారు. అండర్ - 17 టార్గెట్ బాల్ స్టేట్ మీట్‌లో ఐదుగురు, అండర్ -17 షూటింగ్ బాల్ స్టేట్ మీట్‌లో ఆరుగురు విద్యార్థులు, అండర్ -17 జంప్ రోప్‌లో ఐదుగురు విద్యార్థులు, అండర్ - 14 జంప్ రోప్‌లో ఇద్దరు, అండర్ -12 జంప్ రోప్‌లో ఐదుగురు విద్యార్థులు ఎంపికయ్యారని చెప్పారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు ఎం.మునెయ్య, ఎల్.సూర్య నారాయణ రెడ్డి, జి.రామమోహన్,ఎం. అనందరావ్, ఎం. మని ప్రకాష్, ఎ. శ్రీనివాసులు,టి ఓబుల రెడ్డి, పద్మజ, రమాదేవి, పాఠశాల ఫిజికల్ డైరెక్టర్స్ వినోనియా రాణి, చంద్రావతి పాల్గొన్నారు.

జిల్లా వక్ఫ్ బోర్డ్ సభ్యునిగా కరీముల్లా

ప్రజాశక్తి - ఎర్రగుంట్ల



వైసిపి కడప జిల్లా వక్ఫ్ బోర్డ్ కమిటీని 11 మంది సభ్యులతో ఏర్పాటు చేస్తూ వైసిపి కేంద్ర కార్యాలయం నుండి శుక్రవారం ఉత్తర్వులు జారీ అయ్యాయి. జిల్లా వక్ఫ్ బోర్డ్ కమిటీ సభ్యునిగా ఎర్రగుంట్ల పట్టణానికి చెందిన షేక్ కరీముల్లాను నియమించినట్లు పార్టీ కార్యాలయం నుంచి ఉత్తర్వులు అందాయని కరీముల్లా తెలిపారు. ఈ పదవి రావడానికి కారణమైన ఎంపీ అవినాష్ రెడ్డికి, జమ్మలమడుగు ఎమ్మెల్యే సుధీర్ రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. వక్ఫ్ బోర్డ్ సంబంధించి పార్టీలకతీతంగా మైనార్టీల అభివృద్ధి కోసం కృషి చేస్తానని తెలిపారు.

చంద్రబాబుకు సరైన వైద్యం అందించాలి

ప్రజాశక్తి - బద్వేలు

జైలులో చంద్రబాబుకు సరైన వైద్య సదుపాయాలు అందించాలని బద్వేలు తెలుగుదేశం పార్టీ నాయకులు డాక్టర్ ఓబుళాపురం రాజశేఖర్ శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. పార్టీ కష్టకాలంలో ఉన్న సమయంలోనూ బద్వేల్ రాజకీయాల గురించి టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి నారాలోకేష్, అధ్యక్షులు అచ్చెన్నాయుడును వ్యక్తిగతంగా కలిసి చర్చించానని తెలిపారు. టికెట్ గురించి ప్రస్తావించగా చంద్రబాబునాయుడు వచయటు వచ్చాకే ఖరారు చేస్తారని వారు చెప్పారని తెలిపారు. గోపవరం మండలంలో టిడిపి నాయకులు తనకు సంపూర్ణ మద్దతు ఇస్తున్నాన్నారు. 2019 ఎన్నికల్లో బద్వేలు మాజీ ఎమ్మెల్యే విజయమ్మ పిలుపు మేరకు తన 18 సంవత్సరాల ప్రభుత్వ సర్వీసు వదులుకున్నానని చెప్పారు. తాను ఓడిపోయినప్పటికీ గత నాలుగున్నర సంవత్సరాలుగా పార్టీ పిలుపు మేరకు ప్రతి కార్యక్రమాన్ని ప్రజల్లోకి తీసుకెళ్తూ ధర్నాలు ర్యాలీలు , విలేకరుల సమావేశాలు నిర్వహిస్తూ తెలుగుదేశం పార్టీ కార్యకర్తలకు అందుబాటులో ఉన్నానని తెలిపారు. విజయమ్మ, చంద్రబాబు ఆశీస్సులతో పార్టీ కోసం తాను చేసిన సేవలకు బద్వేలు అసెంబ్లీ టికెట్ తనకే వస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు.

వైఎస్ఆర్ బీమా పత్రం పంపిణీ

ప్రజాశక్తి - చాపాడు

అయ్యావారిపల్లె సచివాలయం పరిధిలోని అచ్చుకట్ల చౌసెన్ అనే వ్యక్తి 2 నెలల కిందట ప్రమాదవశాత్తు రోడ్డు ప్రమాదంలో మృతిచెందాడు. అతడి కుటుంబ సభ్యులకు శుక్రవారం ఎమ్మెల్యే ఎస్. రఘురామిరెడ్డి రూ. 5. లక్షల వైఎస్ఆర్ బీమా మంజూరు పత్రాన్ని అందజేశారు. కార్యక్రమంలో మైదుకూరు నియోజకవర్గ వైసిపి సమన్వయకర్త ఎస్.నాగిరెడ్డి ఎంపిపి లక్ష్మమయ్య, ఎంపిడిఒ శ్రీధర్ నాయుడు, తహాశీల్దార్ యామిని, ఎంపిటిసి రమాదేవి, వైసిపి నాయకులు మాధవ్ రెడ్డి, లక్ష్మిరెడ్డి, జయ సుబ్బారెడ్డి, శ్రీను, పివి రమణారెడ్డి, రామాంజనేయుల రెడ్డి, పంచాయతీ కార్యదర్శి వేణు , సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.